క్లుప్తంగా

అదనపు లోడు క్రమబద్ధీకరణ తప్పనిసరి

బల్లికురవ: విద్యుత్ వినియోగదారులు 50 శాతం రాయితీతో అదనపులోడును క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ శాఖ డీఈ ఎం. సురేంద్రబాబు శనివారం తెలిపారు. అదనపులోడు క్రమబద్ధీకరణను డిసెంబర్ 31 వరకు పొడిగించారని ఒక కిలోవాట్‌కు రాయితీ పోను రూ. 1250, 2 కిలోవాట్‌లకు రూ. 2450, 3 కిలోవాట్‌లకు రూ. 3650, 4 కిలోవాట్‌లకు రూ. 4850, 5 కిలోవాట్‌లకు రూ. 6050 చెల్లించి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

వెంకటేశ్వర స్వామికి విశిష్ట పూజలు



బల్లికురవ అలంకరణలో శంకు, చక్రం, నామాలు, పాదాలు

బల్లికురవ: శ్రావణ మాసం పౌర్ణమి శనివారం సందర్భంగా బల్లికురవలోని శ్రీ వెంకటేశ్వర స్వామి మందిరంలో విశిష్ట పూజలు చేపట్టారు. అర్చకులు ఇంకొల్లు సుధీర్‌చే మందిరంలో ఏర్పాటు చేసిన శంకు, చక్రం, నామాలు పాదాలకు పంచామృతాలతో అభిషేకం చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకులైన వెంకటేశ్వరస్వామి జన్మించిన రోజు శ్రావణ మాసం పౌర్ణమి శనివారం, శ్రవణా నక్షత్రం చాలా అద్భుతమైన పర్వదినం అన్నారు. స్వామివారిని దర్శించుకుంటే ఆయురారోగ్యాలతోపాటు అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయన్నారు. గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



నిరుపయోగంగా వైద్య సిబ్బంది క్వార్టర్లు



ఆస్పత్రి సూపరింటెండెంట్ నివాసం ఇలా..

వైద్య సేవలకు ఆటంకం

- ప్రభుత్వాసుపత్రిలో నిరుపయోగంగా వైద్యుల క్వార్టర్లు
- విష సర్పాలకు, మందు బాబులకు అడ్డాగా మారిన వైనం

చీరాల రూరల్: దుగ్గిరాల గోపాల కృష్ణయ్య స్మారక 100 పడకల చీరాల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల గురించి పట్టించుకేవారు కరువయ్యారు. చీరాల, బాపట్ల, పర్చూరు నియోజకవర్గాలకు చెందిన వందలాది మంది రోగులు నిత్యం చికిత్స పొందుతుంటారు. ఇలా ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ వైద్యశాలలోని వైద్యులు, వైద్య సిబ్బందికి కేటాయించిన క్వార్టర్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. లోపల ఉండాల్సిన డోర్లు, కిటికీలు దొంగల బారినపడి మాయమయ్యాయి. మరికొన్ని గదులపై భాగంలో ఏపుగా పిచ్చిమొక్కలు పెరిగాయి. మరుగుదొడ్లు, మంచినీటి పైపులైన్లు, విద్యుత్ వైరింగులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఇంకొన్ని గదులు మందుబాబులకు అడ్డాగా మారిపోయాయి. ఈ క్వార్టర్లను వినియోగంలోకి తెస్తే సత్వర వైద్య సేవలు పొందవచ్చని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వివరాల్లోకి వెళితే...

ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల లాల్ బహదూర్ శాస్త్రి నగర్‌లో ఎంతో సువిశాల ప్రదేశంలో నిర్మించారు. వైద్యశాల నిర్మించి ఏళ్ల గడుస్తుండటంతో కొన్ని గదులు శిథిలావస్థకు చేరాయి. వైద్యశాల వెనుక ఏడేళ్ల క్రితం రూ. 10 కోట్లు వెచ్చించి కొత్త ఆస్పత్రి భవనాలు నిర్మించారు. పాత ఆస్పత్రి నిర్మించిన సమయంలోనే అదే ఆస్పత్రి ప్రాంగణంలో క్వార్టర్లు కూడా నిర్మించారు. ఆస్పత్రి సూపరింటెండ్‌తో పాటు వైద్యులు, వైద్య సిబ్బంది, క్వార్టర్స్‌లో నివాసముంటూ నిరంతరం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించాల్సి ఉంది. కానీ ఏడేళ్లుగా నిరుపయోగంగా మారిపోయాయి. ఇప్పటికి కొందరు వైద్య సిబ్బంది ప్రతిరోజూ ఆస్పత్రిలో డ్యూటీలు చేస్తు ఎంతో వ్యయప్రయాసలతో సుదూర ప్రాంతాల నుంచి వస్తున్నారనే ఆరోపణలు దండిగా వినిపిస్తున్నాయి.



నిర్మానుష్యంగా మారిన వైద్యుల నివాసం

పర్యవేక్షణ కరువు..

అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడు నోట్లో శని ఉందన్న చందాన ఈ ఆస్పత్రిలో రోగులకు అవసరమైన అన్ని విభాగాలున్నాయి. ఒకరిద్దరు మినహా అన్ని విభాగాలకు సరిపడా వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు. కానీ ఆస్పత్రికి పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలోని క్వార్టర్లను పునరుద్ధరించి వైద్యులు, వైద్య సిబ్బదికి కేటాయిస్తే ఆస్పత్రికి పూర్వ వైభవం వస్తుందని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని అంతా కోరుకుంటున్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాలను స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టండి



నక్కబొక్కలపాడులో సూచనలు ఇస్తున్న ప్రత్యేకాధికారి



చీరాల: సమావేశంలో సూచనందిస్తున్న మండల ప్రత్యేకాధికారి

బల్లికురవ: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ జ్వరాలు, వ్యాధులు సోకకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలను స్పెషల్ డ్రైవ్‌గా నవంబర్ వరకు కొనసాగించాలని మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా ఎక్సైజ్ అధికారి బి.వెంకటేశ్వర్లు కోరారు. శనివారం సాయంత్రం మండలంలోని నక్కబొక్కలపాడు గ్రామాన్ని పరిశీలించారు. చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. నక్కబొక్కలపాడులో ఫాగింగ్ పనులను పరిశీలించారు. ఎంపీడీఓ జి. పాండురంగస్వామి, సెక్రటరీ షేక్ మీరావలి, సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్య మాజీ సర్పంచ్‌లు హనుమంతరావు రామస్వామి పాల్గొన్నారు.

చీరాల టౌన్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో విషజ్వరాలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేసి గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేకాధికారి, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ ఎం.సుబ్రమణ్యేశ్వరరావు ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివన్నారాయణ, ఈవోఆర్డీ రామకృష్ణ, పీహెచ్‌సీ వైద్యులు శ్రీదేవితో కలిసి గ్రామ పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు, ఏఎన్ఎంలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. బ్లీచింగ్ చల్లించి మురుగునీటి నిల్వల్లో ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. ఏపీఓ దాసు, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, వీఆర్వోలు, సచివాలయాల ఉద్యోగులున్నారు.

చీరాల టౌన్: ఇళ్లల్లో నుంచి వచ్చిన చెత్తను రోడ్లపై వేసేవారిపై చర్యలు తీసుకుంటామని ఈపురుపాలెం పంచాయతీ కార్యదర్శి మురళీబాపూజీ తెలిపారు. శనివారం ఈపురుపాలెం, రామకృష్ణాపురం



రామకృష్ణాపురంలో విధుల్లో ఉన్న కార్మికులు



కారంచేడులో లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నేతాజీ

గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

కారంచేడు: పరిసరాల పరిశుభ్రత అలవర్చుకోవాలని ఎంపీడీఓ కె. నేతాజీ అన్నారు. శనివారం కారంచేడులోని అంబేడ్కర్ నగర్ కాలనీ, ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీ సమీపంలోని గృహాలను పరిశీలించారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సురేష్‌బాబు, డాక్టర్ పృధ్వీరాజ్, ఈఓపీఆర్డీ రాంమ్మోహన్, వైద్య సిబ్బంది, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మండల కన్వీనర్ , వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

యద్దనపూడి: ఎన్నికల్లో గెలవడానికి అలివిగాని హామీలను గుప్పించి వాటిని అమలు చేయకుండా మోసం చేసే నాయకుడు దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది కేవలం చంద్రబాబునాయుడని యద్దనపూడి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రావూరి వేణుబాబు అన్నారు. శనివారం మండలంలోని గన్నవరం, పూనూరు గ్రామాల్లో బాబు షూర్యిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవటాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పింఛన్లు ఇవ్వకపోగా.. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షలకు పైగా పింఛన్లు తొలగించి ఆయా కుటుంబాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిని రెడ్‌బుక్ పేరుతో వేధించి అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. సంపద సృష్టిస్తామని గొప్పలు చెప్పి పథకాలు అమలు చేయకుండానే ఏడాదిలోనే ఏకంగా రూ.1.81 లక్షల కోట్లు అప్పులు చేసిన చంద్రబాబు తెచ్చిన అప్పు ఎలా ఖర్చు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. మోసం చేయడంతో పాటు వెన్నుపోటు చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. ఇలాంటి నాయకుడు చేసిన మోసాలను ప్రజలు గుర్తుంచుకొని 2029 లో వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు ముప్పల రాంబాబు, దాసరి వెంకట్రావు, చెరుకూరి వేణు, మేకా సుధాకర్, బత్తుల ఆంజనేయప్రసాద్, యన్నం శ్రీను, బొబ్బేపల్లి శ్రీకాంత్, మేకా సుగుణరావు, మేకా అశోక్, కుంచపు అంకమ్మ, మేకా అక్కయ్య, బేతపూడి అంజియ్య, గోదాసి రాజా, బేతపూడి వాసు, తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు ఆర్టీసీ డిపో నిర్మాణానికి సహకరించండి



రీజనల్ మేనేజర్ సామ్రాజ్యంతో మాట్లాడుతున్న మోహనకృష్ణ

ఇంకొల్లు(చినగంజాం): ఇంకొల్లు మండల కేంద్రంలో ఆర్టీసీ డిపో నిర్మాణానికి సహకరించాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ డి. సామ్రాజ్యాన్ని మండల ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు అన్నంబొట్ల మోహనకృష్ణ కోరారు. శనివారం ఇంకొల్లు ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలించేందుకు వచ్చిన ఆమెతో మాట్లాడారు. కార్గో ద్వారా తక్కువ ఆదాయం వస్తోందని, దూర ప్రాంతాలకు కూడా సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆమె ఏజెంటు ధనరాజుకు సూచించారు. ప్రయాణికులు ఇంకొల్లు బస్టాండుకు వచ్చే బస్సు సౌకర్యాల గురించి ఆమెకు వివరించారు. గుంటూరు, బెంగళూరు, విజయవాడకు బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఆమె దృష్టికి తీసుకొని వచ్చారు. అనంతరం ఆమె ఆర్టీసీ డిపో నిర్మాణం కోసం కేటాయించి స్థలాన్ని పరిశీలించారు. స్థలం అపరిశుభ్రంగా ఉండటంతో డిపో మేనేజర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి డిపో నిర్మాణ సమస్యను తీసుకొని వెళ్ళి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చీరాల డిపో మేనేజర్ శ్యామల, పీవీ రావు, కంట్రోలర్ బాబు పాల్గొన్నారు.

శక్తి టీం సభ్యులకు రాఖీలు కట్టిన మహిళలు



పోలీసులకు రాఖీలు కడుతున్న మహిళలు

చీరాల: రాఖీ పండగను పురస్కరించుకుని శనివారం చీరాల సబ్ డివిజన్‌లో విధులు నిర్వహిస్తున్న శక్తి బృందానికి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో పనిచేసే మహిళలు స్వచ్ఛందంగా రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. శక్తి టీం సభ్యులు నిరంతరం తిరుగుతూ మహిళలకు రక్షణ కల్పిస్తున్నారన్నారు. శక్తి బృందం సమర్థవంతంగా పని చేయడం వలనే తాము ధైర్యంగా పనిచేసుకుంటున్నామని షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్‌లో పనిచేసే మహిళా సిబ్బంది తెలిపారు. రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని పోలీస్ సిబ్బందిని తమ కుటుంబ సభ్యులుగా భావించి రాఖీ కట్టామన్నారు. చీరాల సబ్ డివిజన్ శక్తి టీం ఎస్సై హరిబాబు మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు సబ్ డివిజన్‌లో పాఠశాలలు, కళాశాలలు, మహిళలు పనిచేసే ప్రాంతాల్లో శక్తి యాప్ గురించి అవగాహన కల్పించి, యాప్ వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నట్లు తెలిపారు.

వృద్ధుడిని ఢీకొన్న బైక్

చీరాల: రోడ్డు దాటుతున్న వృద్ధుడిని ద్విచక్రవాహనంపై వస్తున్న వ్యక్తులు ఢీకొనడంతో తీవ్రగాయాలైన సంఘటనపై శనివారం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... చీరాల బోస్ నగర్‌కు చెందిన సీహెచ్ నాగేశ్వరరావు (60) శనివారం ప్రసాద్ థియేటర్ సమీపంలో రోడ్డు దాడుతుండగా ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చిన యువకులు వృద్ధుడిని ఢీకొంది. చీరాల్లోని ప్రైవేటు హాస్పిటల్‌లో చేర్చారు. ఒన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం శ్రావణ మాసం ధనిష్ఠ నక్షత్రం పాడ్యమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టండి



సంతమాగులూరు: పరిసరాలను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఈవో బాలమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

అద్దంకి రూరల్: సీజనల్ వ్యాధులు, జ్వరాలు సోకుతుండున గ్రామగ్రామాన పారిశుద్ధ్య పనులు వేగవంతంగా చేపట్లాని ఎంపీడీవో సింగయ్య కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కోరం కాకపోవటంతో గంట ఆలస్యంగా సమావేశం ప్రారంభమైంది. సమావేశానికి ఎంపీపీ అవిశెన జ్యోతి అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు వారి శాఖకు సంబంధించిన కార్యక్రమాలను వివరించారు. సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంతమాగులూరు(అద్దంకి రూరల్): పారిశుద్ధ్య పనుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం వహించవద్దని డిప్యూటీ సీఈవో బాలమ్మ అన్నారు. శనివారం పాతమాగులూరు గ్రామాన్ని సందర్శించారు. మంచినీటికి క్లోరినేషన్ చేయాలన్నారు. ఎంపీడీవో జ్యోతిర్మయి పాల్గొన్నారు.

వాహనాల పత్రాలు వెంట తెచ్చుకోండి



కారంచేడులో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ ఖాదర్ బాషా

కారంచేడు: వాహన యజమానులు తప్పకుండా తమ వాహన పత్రాలను వెంట తెచ్చుకోవాలని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా అన్నారు. శనివారం వాడరేవు–పిడుగురాళ్ళ ప్రధాన రహదారిలో మండల కేంద్రమైన కారంచేడు అంబేడ్కర్ నగర్ కాలనీ సమీపంలో వాహన తనిఖీలను ముమ్మరంగా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు, ఆటోవాలాలు, కార్‌లు వంటి వాహనాలకు అవసరమైన అన్ని రకాల పత్రాలను వెంట తెచ్చుకోవాలన్నారు. ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి పత్రాలు తప్పకుండా ఉండాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను కూడా వినియోగించాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. పలువురు వాహన యజమానులకు జరిమానాలు విధించారు.

భక్తిశ్రద్ధలతో విఖనస మహర్షి జయంతి



విఖనసాచార్యుని నగరోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: శ్రావణ పౌర్ణమి, విఖనస మహర్షి జయంతి శనివారం స్థానిక విఠల్‌నగర్‌లోని రుక్మాబాయి సమేత పాండురంగస్వామి దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి ఉత్సవమూర్తికి పంచామృత అభిషేకం, విశేష అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా చీరాల డివిజన్ పరిధిలోని చీరాల, పర్చూరు, అద్దంకి ప్రాంతీయ వైఖానస సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జరిగిన సభను నిర్వహించారు. రావులకొల్లు పరాంకుశం వెంకట రంగాచార్యులు అధ్యక్షత వహించారు. పరాశరం వేదమూర్తి, పలువురు వక్తలు విఖనస మహర్షి ఆవిర్భావం, వైఖానస ఆగమ విషయాలపై మాట్లాడారు. అలానే స్వామివారి ఉత్సవమూర్తిని వీధుల్లో ఊరేగించారు. అనంతరం సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. చీరాల డివిజన్ అధ్యక్షుడు రావులకొల్లు పరాంకుశం వెంకటరంగాచార్యులు, ప్రధాన కార్యదర్శి నారాయణం శ్రీనివాసాచార్యులు, కోశాధికారి వినుకొండ వెంకట ఫణీంద్రకుమార్, రత్నాకరం శ్రీమన్నారాయణ, దీవి సంపత్ జగన్నాథాచార్యులు, దేవాలయ అర్చకులు వేదాంతం రంగనాథ్, వేదాంతం కిరణ్‌కుమార్, నారాయణం వరదాచార్యులు, శ్రీనివాసుల హనుమాచార్యులు, చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాలలోని వైఖానస సంఘీయులు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో ముప్పు



కాటన్ సంచుల పంపిణీ ప్రారంభించిన కమిషనర్

అద్దంకి: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణానికి ముప్పు కలుగుతుందని మునిసిపల్ కమిషనర్ రవీంద్ర అన్నారు. శనివారం పర్యావరణ పరిరక్షణ కమిటీ అద్దంకి అధ్యక్షుడు మన్నం త్రిమూర్తులు సౌజన్యంతో 500 కాటన్ బ్యాగ్‌లను, 500 అవగాహన కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించినట్లు ఈ నెల 19న సమావేశలో తెలియజేశామని తెలిపారు. వ్యాపారులు ప్రత్యామ్నాయ సంచులను వినియోగంచాలని చెప్పారు. మన్నం త్రిమూర్తులు, కేర్ అండ్ క్యూర్ హోమియో వైద్యుడు కావూరి రఘుచంద్ పాల్గొన్నారు.